# శ్రీ(వారి)మతి


శ్రీ రావుగారిని రోటరీలో ప్రసంగించ వలసిందిగా కోరారు. అందుకు ఆయన అంగీకరించారు. చాలా సంతోషించారు కూడా. ఆయన చాలాకాలం నుంచి, చదివి పరిశోధించిన విషయం వేదిక మీద చెప్పే అవకాశం యిన్నాళ్ళకు కలిగింది. కాని ఆయనకు ఉపన్యాసాలు యివ్వడం అంతగా అలవాటు లేదు. అందుకని ఆయన వారం రోజులు ముందునుంచే తన ఉపన్యాసం రాసుకుని నోట్సు తయారు చేసుకున్నారు.

ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకే ఆయన ఉపన్యాసం. అప్పుడే అయిదున్నర కావస్తోంది. కాని రావుగారు యింకా గళ్ళలుంగీ, బనీనుతో బల్ల దగ్గర కూర్చుని పుస్తకాలు తిరగేస్తూ, కాగితాలు చూసుకుంటూనే ఉన్నారు. ఇంతలో యింటి ముందర కారు హారన్ మోగింది. రావుగారు గతుక్కుమని బయటకు వచ్చి చూశారు. కారులోంచి ఇద్దరు పెద్ద మనుష్యులు సూట్లు ధరించి దిగి, లోపలికి వస్తూనే 'వుయార్ ఫ్రమ్ రోటరీ. మిమ్మల్ని సభకు కారులో తీసుకు వెళ్ళడానికి వచ్చాం' అన్నారు. రావుగారు కంగారు పడిపోయారు. ఆయన ఉపన్యాసం తయారు చేసుకోడంలో టైమే మరిచిపోయారు. తను యింకా గడ్డం గీసుకోలేదనీ, స్నానం చెయ్యాలనీ, డ్రెస్ వేసుకోవాలనీ, అన్నీ గుర్తుకు రావడంతో, రావుగారికి కాళ్ళు వణికాయి. ఆ వచ్చిన పెద్ద మనుష్యులను చూస్తే ప్రతి పనీ టైమ్ ప్రకారం జరగాలన్న పట్టుదల కలవారుగా కనిపించారు. 'కూర్చోండి' అన్నారు రావుగారు తడబడుతూ.

ఇద్దరూ ఒకేసారి వాచీ చూసుకున్నారు. 'క్షమించండి. టైమ్ లేదు. సరిగ్గా అయిదున్నరయింది. మీరెంత సేపట్లో తయారవగలరు?' అన్నారు.

రావుగారు కంగారు పడిపోయారు. ఆయన ఒక గంటకి తెమలగలిగితే గొప్ప విషయమే.

దేవరకొండ
పద్మావతి



రావుగారు వెంటనే సమాధానం చెప్పాలన్నట్టు, వాళ్ళిద్దరూ మళ్ళీ గడియారాలు చూసుకున్నారు. రావుగారు మొగమాట పడిపోయి 'నాకు అయిదు నిమిషాలు యివ్వండి చాలు' అని లోపలికి పరుగెత్తారు. రావుగారి శ్రీమతి వెనక నుండి అంతా విన్నది. రావుగారి పరుగు చూసి నవ్వుకుని, ముందు గదిలోకి వచ్చి ఆ పెద్ద మనుషులతో అంది: 'సారీ. మా వారు తయారవడానికింకా యిరవై అయిదు నిమిషాలైనా కావాలి. మీరు శ్రమనుకోకుండా సరిగా అయిదు నిమిషాలు తక్కువ ఆరింటికి రాగలరా?'

ఇద్దరూ మళ్ళి వాచీలు చూసుకుని, ఒకళ్ళ మొహాలు ఒకళ్లు చూసుకున్నారు. 'ఓ. కే. మేడమ్. ఎగ్జాక్ట్‌లీ ఫైవ్ మినిట్సు టు సిక్స్‌కి వస్తాం. రావుగారినీ రెడీగా ఉండమనండి' అని చెప్పి, వెళ్ళిపోయారు.

రావుగారి శ్రీమతి, సీత లోపలికి వచ్చింది. రావుగారు ఇల్లంతా కలయ తిరిగేస్తున్నారు. ఆయన ముఖం ఆందోళనతో ఎర్రబడిపోయింది. 'నా నోట్స్....నేను రాసుకున్న నోట్స్ ఏదీ కనిపించటంలేదు?' అంటూ ఆయన అన్నీ వెతికేస్తున్నారు. శ్రీమతి నవ్వుకుని 'ఆ నోట్స్ నేను చూసి జాగ్రత్త చేస్తాను కాని ముందర మీరు స్నానానికి నడవండి' అంది తొందరచేస్తూ.

'అయితే నువ్వు నోట్స్ వెతుకుతావు కదూ? నేను స్నానం చేసి వస్తాను' అంటూ రావుగారు మళ్ళీ ఆ గదిలోకీ, యీ గదిలోకీ పరుగులు మొదలెట్టారు.

'ఏమిటా కంగారూ, మీరూ? స్నానానికి వెళ్ళరేం?' అని కోప్పడింది శ్రీమతి.

'అది కాదు. నా టవెల్....నా టవెల్ కనిపించటంలేదు.' అని ఆయన చుట్టూ చూసేస్తున్నారు.

'మీ టవెల్ బాత్‌రూమ్‌లో పెట్టాను. వెళ్ళండి' అని గద్దించింది.

రావుగారు తల గోక్కుంటూ 'మరి నా రేజర్..' శ్రీమతి మధ్యలోనే అందుకుని అంది:

'మీ రేజరూ, బ్రష్, సబ్బూ, టవెలూ అన్నీ అక్కడే పెట్టాను. ఊరికే చిందులు తొక్కక త్వరగా వెళ్ళండి.' అంత కంగారులోనూ ఆయన తన శ్రీమతి తెలివికి కళ్ళతోనే కృతజ్ఞత తెలుపుకుని బాత్‌రూమ్‌లో దూరబడ్డారు.

'ఇదిగో గడ్డం జాగ్రత. నెమ్మదిగానే చేసుకోండి. ఫరవాలేదు. యింకా టైముంది.' అని, 'చూడండి, డెట్టాల్ కావలిస్తే అక్కడే ఎడంవైపు షెల్ఫులో రెండో పక్క ఉంది' అంది శ్రీమతి బయటి నుంచి.

రావుగారికి నిజంగానే అది కావలిసొచ్చింది.

''ఆఁ డెట్టాల్ కనిపించింది....కొంచెం తెగింది. ఫరవాలేదులే....థ్యాంక్స్.''

మరి పదినిముషాల్లో రావుగారు బాత్‌రూమ్ నుంచి బయటపడ్డారు పెద్ద యుద్ధం చేసి వచ్చినట్లు. చన్నీళ్ళ స్నానం చేసినా ఆయనకు చెమటలు పట్టేస్తున్నాయి.

'ఇంక పదిహేను నిముషాలు కూడా లేదు....అర్జంట్....క్విక్....క్విక్' అని ఆయనలో ఆయనే అనేసుకుంటున్నారు.

'ఇదిగో సీతా టైమైపోతోంది. ఏం బట్టలు వేసుకోమంటావ్? ఏవీ తాళాలు? బట్టల బీరువా తాళాలు ఏవీ?' అంటూ అరవడం మొదలెట్టారు.

ప్రక్క గదిలో ఎంబ్రాయిడరీ కుట్టుకుంటూ శ్రీమతి తాపీగా సమాధానమిచ్చింది—'అనవసరంగా అరవకండి. తాళాలెందుకూ? మీరు యివాళ వేసుకోవలసిన పాంటూ, షర్టూ అన్నీ పక్క మీద పెట్టాను. మీ కోటు హేంగర్‌కి తగిలించాను. బనీను డ్రాయరూ అక్కడే ఉన్నాయి. త్వరగా కానివ్వండి' అంది.

''రక్షించావ్. ఆఁ అన్నీ ఉన్నాయి. వెరీ గుడ్. ఇదిగో డ్రెస్ అయిపోతున్నాను' అంటూ స్వగతం ప్రారంభించారు రావుగారు. కాని తీరా డ్రెస్ వేసుకుని మళ్ళీ గిరగిర తిరగడం చూసి శ్రీమతి వెనకనే వచ్చి. 'అలా గుండ్రంగా తిరక్కపోతే నన్నడక్కూడదూ? ఇదిగో దువ్వెన, ఆయిల్, పౌడరు' అంటూ అందిచ్చింది.

'ఆఁ వీటికోసమే చూస్తున్నాను. ఇంక రెడీ అయిపోయినట్టే' అన్నారు రావుగారు కొంచెం స్థిమితపడి అద్దంలో చూసుకుంటూ. కాని మరుక్షణంలోనే గాభరాపడిపోతూ, గదిలో లెదర్ బ్యాగ్ తీసి అందులోవన్నీ ఒక్కొక్కటే బయట పడేసేస్తున్నారు.

'అదిగో మీ 'టై' వెంకటేశ్వరస్వామి ఫొటో దగ్గర మేకుకి తగిలించాను. ఆ పెట్టంతా దులిపేస్తున్నారెందుకూ? అది మీపెట్టె కాదు' అంది శ్రీమతి చిరాగ్గా.

'హమ్మయ్య. నా చారల టై. దానికోసమే గాలిస్తున్నా. అని రావుగారు టై తీసుకుని కట్టుకున్నారు. శ్రీమతి ఎంబ్రాయిడరీ కుట్టుకుంటూ ప్రక్క గదిలోకి వెళ్ళింది. ఇంతలో మళ్ళీ రావుగారి బుర్ర చెడిపోయింది. 'సీతా! నా బూట్లు. నా బూట్లెక్కడున్నాయి? అసలున్నాయా? లేక బాబీగాడు దొడ్లో పారేశాడా? వాటికి పాలిష్ లేదూ, నా మొహం లేదూ! ఛీ! యింత వేషం వేసి బూట్లు లేకుండానా? నాబూట్లు....' అంటూ ఆయన ఆత్రుతగా మంచం కిందా, పైనా, కుర్చీల కిందా, ఆఖరుకి పరుపుల కింద కూడా వెతికెయ్యడం మొదలెట్టారు.

శ్రీమతి వచ్చి 'అయ్యో రామా! మీ కంగారు మీదేకాని నామాట వినిపించుకోరే? మీబూట్లు మధ్యాహ్నమే పాలిష్ చేసి డ్రాయింగ్ రూమ్‌లో సోఫా దగ్గర పెట్టాను. వెళ్ళి తొడుక్కోండి. సాక్స్ కూడా అందులోనే ఉన్నాయి' అంది. రావుగారు మాట్లాడకుండా డ్రాయింగ్ రూమ్‌లోకి పరుగెత్తారు. అక్కడ రెండు బూట్లు మెరుస్తూ, నల్ల పిల్లుల్లా ఉన్నాయి. అందులోంచి యిస్త్రీ సాక్స్ తొంగి చూస్తున్నాయి. రావుగారు సంతోషంతో బూట్లు తొడుక్కున్నారు.

'ఆఁ ఇంక రెడీ. నిజంగా రెడీ. ఏదీ యింకా వాళ్ళ కారు రాలేదే' అనుకుంటూనే ఆయనకేదో జ్ఞాపకం వచ్చింది. 'సీతా! అన్నట్టు. ఒక్కడోసు.. అంటే ఒక కప్పు—కాఫీ, వెళ్లేముందర తాగొద్దూ?' అన్నారు.

'ఆఁ తాగాలి. లేకపోతే మీకు ఉన్న మతికూడా పోతుంది. డైనింగ్ టేబిల్‌మీద యిప్పుడే కాఫీ వేడిగా పెట్టి వచ్చా. వెళ్ళి తాగండి' అంది శ్రీమతి.

రావుగారు వెళ్ళి కంగారుగా కాఫీ తాగేశారు. 'కాఫీ చాలా బాగుంది. వెరీఫైన్, సీతా థ్యాంక్యూ. యిక నేను రెడీ' అంటూ సిగరెట్టు నోట బిగించి, దేనికోసమో వెతికేసుకుంటున్నారు. శ్రీమతి ఓరగా చూసి ఆయన అవస్థకు జాలిపడుతూ అంది—'అగ్గిపెట్టె మీ కోటు కుడివైపు లోపలి జేబులో ఉంది', రావుగారు అగ్గిపెట్టె చూసుకుని సంతోషపడిపోయి, సిగరెట్టు అంటించి రెండు దమ్ములు లాగారు.

'అమ్మ! ఎంత కంగారయిపోయింది? నేను రెడీ. ఇంకా వాళ్ళ కారు రాలేదే?....ఇదిగో, సీతా మనకో రుమాలుంటే మంచిదేమో?' అన్నారు గొప్ప విషయం కనిపెట్టినట్టు. శ్రీమతి నవ్వుతూ 'నాకు అక్కర్లేదు. కాని మీకుండాలి. మీకోటు ఎడమవైపు కింద జేబులో రుమాలు పెట్టాను.

చూసుకోండి' అంది. రావుగారి మొహం వికసించింది. శ్రీమతి వైపు ప్రేమగా తృప్తిగా చూశారు. రుమాలు తీసి ఒకసారి మొహం అద్దుకున్నారు. 'సీతా యీ రుమాలు మంచి సువాసన వస్తోంది' అన్నారు చిన్న పిల్లవాడిలా మురిసిపోతూ.

'అవును. దాని మీద లావెండర్ డ్రాప్స వేశాను'.

'వెరీ థాట్‌ఫుల్ ఆఫ్ యు. ఇంక నేను పూర్తిగా రెడీ. వాళ్ళు రావడమే ఆలస్యం.' అంటూండగానే కారు హారన్ వినిపించింది. హారన్ వినగానే రావుగారికి ఆయన రాసుకున్న నోట్సు విషయం గుర్తుకు వచ్చింది. 'సీతా కొంప మునిగింది. వాళ్ళొచ్చేశారు....కాని నా నోట్సు....' అనుకుంటూ ఒక్క గంతులో ఆయన రూమ్‌లోకి వెళ్ళి బల్లమీద కాయితాలన్నీ కెలికేస్తూ నోట్సు కోసం వెతికేస్తున్నారు. శ్రీమతి వెనకాలే వెళ్ళి నిట్టూరుస్తూ 'ప్లీజ్, కొంచెం శాంతించండి. మీ నోట్సు పిన్ చేసి మీ కోటు ఎడమవైపు లోపలి పాకెట్‌లో పెట్టాను. వాళ్ళు పిలుస్తున్నారు వెళ్ళండి' అంది. రావుగారు నోట్సు కోసం జేబు చూసుకున్నారు. నీట్‌గా పిన్‌చేసి పెట్టి ఉంది. రావుగారు ఆనందంతో ఏదో అందామనుకున్నారు. కాని బయటినుంచి 'మిస్టర్ రావ్' అన్న పిలుపు విని పరిగెత్తారు.

'సరిగ్గా అన్న టైముకి రెడీ అయిపోయారు. థ్యాంక్యూ' అన్నారు పెద్ద మనుష్యులు వాచీలు చూసుకుంటూ. మరుక్షణంలో కారులో ఎక్కి రావుగారు వాళ్ళతో వెళ్ళిపోయారు.

రాత్రి ఎనిమిది గంటలకి మళ్ళీ రావుగారిని కారులో యింటికి దిగబెట్టారు. యీసారి రావుగారి చేతిమీద పెద్ద మల్లెదండ, చేతిలో బొకే ఉన్నాయి. ఆయనతో వచ్చిన వాళ్ళు అన్నారు, 'మీవారు యివాళ బ్రహ్మాండంగా ఉపన్యసించారండీ' అని. వాళ్ళు వెళ్ళిపోయాక శ్రీమతి—రావుగారిని గర్వంగా చూసుకుంటూ అంది 'పెద్ద దండే వేశారే!' అని.

రావుగారు శ్రీమతిని మెరిసే కళ్ళతో చూస్తూ నెమ్మదిగా దగ్గరకు వచ్చారు. తన చేతిలో దండ ఆమె మెడలో వేస్తూ 'నిజంగా యీ దండ నీది. నువ్వు లేందే అసలు యీరోజు మీటింగ్‌కే వెళ్ళగలిగి వుండేవాడిని కాదు' అన్నారు.

'మతిలేని మా శ్రీవారికి మతిని నేను' అనుకుంది శ్రీమతి నవ్వుకుంటూ. ❋




# కొత్త వస్తువులు

ఈ చిత్రంలో మూడు వస్తువులు కనిపిస్తున్నాయి. ఒక ప్లాస్టిక్ టంబ్లరు, రెండు తురిమే సాధనాలు. కొన్ని వంటకాలు చేసేటప్పుడు, దినుసులు తూచి వెయ్యవలసి వస్తుంది. తూచుకోడం ఇబ్బందైన పని కాబట్టి, కొలతల ప్రకారం వేసుకోవచ్చు. పంచదార, రవ, బియ్యం; లేదా పాలు లాంటి ద్రవపదార్థాలు సరిగ్గా లెక్కప్రకారం – దీని మీద వుండే గుర్తులప్రకారం కొల్చి వేసుకోవచ్చు. దీని ధర–రూ. 3. 75.

పళ్ళు, బంగాళదుంపలు మొదలైనవి రకరకాల ఆకారాల్లో కోసుకోడానికి 'ఇటాలియన్ స్టైల్ పొటాటొ స్పైరల్' అన్నది ఇందులో కనిపిస్తున్నది. దీంతో వాటిని అందంగా కోసి, ఆకర్షణీయంగా అమర్చవచ్చు. దీని ధర–రూ. 6. 25.

ఇంకొకటి – 'జర్మన్ స్టైల్ పొటాటో మెష్' ఇది కూడా కాయగూరల్ని రకరకాల ఆకారాలలో తరుగుతుంది. బంగాళదుంపలు, బీట్‌రూట్, వంకాయలు వంటి వాటిని దీంతో రకరకాలుగా తరగవచ్చును. దీని వెల–రూ. 15. 75.

ఈ మూడు వస్తువులూ అన్వర్‌జమాల్, 108 మౌంట్‌రోడ్డు, మద్రాసు 18 చిరునామాలో దొరుకుతాయి.